క్లుప్తంగా

వాహనాలు తనిఖీ



తనిఖీ చేస్తున్న పోలీసులు

లక్ష్మణచాంద: మండలంలోని రాచాపూర్ గ్రామ సమీపంలో ఆదివారం పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. వాహనాల ధ్రువపత్రాలు పరిశీలించి డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు చేశారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని సిబ్బంది పేర్కొన్నారు. కార్యక్రమంలో సిబ్బంది వాహిద్, అశోక్ ఉన్నారు.

ముగిసిన క్రికెట్ పోటీలు

కడెం: మండలంలోని అంబారిపేట్ గ్రామంలో నిర్వహించిన క్రికెట్‌పోటీలు ముగిశాయి. ఆదివారం ఫైనల్ మ్యాచ్‌లో జన్నారం, అంబారిపేట్ జట్లు తలపడగా జన్నారం జట్టు విజేతగా.. అంబారిపేట్ జట్టు రన్నరప్‌గా నిలిచింది. ఆ జట్లకు సర్పంచ్ కొప్పుల లక్ష్మి, లచ్చన్న, నిర్వాహకులు చంటి, స్వామి, రాజు, రాజేశ్ బహుమతులు అందజేశారు.

ఆటలతోనే ఆరోగ్యం

సారంగపూర్: ఆటలు ఆడితే ఆరోగ్యంగా ఉంటామని సర్పంచ్ మహిపాల్ మురళీకృష్ణ అన్నారు. మండలంలోని జామ్ గ్రామంలో క్రికెట్ టోర్నీ ముగింపు పోటీలు నిర్వహించగా ఆయన హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ విలాస్, నిర్వాహకులు కండెల రాము తదితరులు ఉన్నారు.

ముగిసిన సప్తాహం



శోభాయాత్రగా వెళ్తున్న బాసర వాసులు

భైంసా: బాసర శ్రీకృష్ణ ఆలయంలో ప్రారంభమైన సప్తాహం ఆదివారం ముగిసింది. ఆలయం నుంచి బాసర సరస్వతీ ఆలయం వరకు పల్లకిసేవ శోభాయాత్ర నిర్వహించారు. శ్రీకృష్ణ ఆలయ కమిటీ అధ్యక్షులు భూమానంద్‌మహారాజ్, బాసర యాదవ సంఘం అధ్యక్షులు ప్రసాద్‌యాదవ్ పలువురు శోభయాత్రలో పాల్గొన్నారు. ఏడు రోజులపాటు పారాయణం, కాగడ హారతి వంటి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటుచేశారు.

గుంత పూడ్చివేత



గుంతలో మట్టి పోస్తున్న ట్రాక్టర్

సాక్షి ఎఫెక్ట్..

లోకేశ్వరం: మండలంలోని రాయపూర్‌కాండ్లీ నుంచి ముధోల్ మండలం ఎడ్‌బిడ్ వెళ్లే మార్గంలో ఉన్న కల్వర్టు ఇటీవలి వర్షాలకు కోతకు గురై గుంత ఏర్పడిన విషయం తెలిసిందే. దీనిపై ఈనెల 15న సాక్షిలో గుంతతో పొంచి ఉన్న ముప్పు అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి స్పందించారు. వాహనదారులు ఇబ్బంది పడకుండా సర్పంచ్ గజ్వేరి పోసాని గుంత పై మొరం పోయించి సమస్య పరిష్కరించారు.

శ్రీ గజ్జలమ్మ దేవికి పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

కుంటాల: మండల కేంద్రంలోని శ్రీ గజ్జలమ్మ దేవి ఆలయంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. గురుస్వామి జక్కని గజేందర్, అర్చకుడు నగేశ్ ఆధ్వర్యంలో శ్రీ గజ్జలమ్మ, ముత్యాలమ్మ, మహాలక్ష్మి అమ్మవార్లకు అభిషేకం, అలంకరణ, అర్చన, పల్లకిసేవ నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

వనితాశక్తి ఆధ్వర్యంలో ఆలయంలో పూజలు



పూజలు చేస్తున్న మహిళలు

ఖానాపూర్: పట్టణంలోని శివాజీనగర్ వనితాశక్తి శాఖ ఆధ్వర్యంలో మండలంలోని మస్కాపూర్ గ్రామంలో గల శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయంలో మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. మన అమ్మకు మన సారె మన సారా కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆ సంఘ సభ్యులు పద్మ, భార్గవి, రజిత, స్వరూప, శ్రీలత, సుమ, వనజ, తదితరులు ఉన్నారు.

ప్రాణాంతక గుంతలు



గుంతలమయంగా మొగ్లి రోడ్డు



కంకరతేలిన మసల్గా వెళ్లే రోడ్డు

- తానూరు మండలంలో అధ్వాన రోడ్లు
- నాసిరకం పనులతో గుంతలు పడి కంకరతేలిన వైనం
- ప్రమాదాల బారిన పడి ప్రాణాలు కోల్పోతున్న ప్రజలు
- మరమ్మతులు చేపట్టని అధికారులు

తానూరు: మన దేశంలో రోగాల బారిన పడి మరణించేవారి కన్నా.. రోడ్డు ప్రమాదాల్లో మృత్యువాత పడే వారి సంఖ్యే ఎక్కువ. అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడంతోపాటు నాసిరకంగా నిర్మించిన రోడ్లు కూడా ప్రమాదాలకు కారణమవుతున్నాయి. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ నిబంధనలను పట్టించుకోకపోవడంతో నిర్మించిన కొద్ది రోజులకే గుంతలు ఏర్పడి, కంకరతేలి రోడ్లు అధ్వానంగా మారుతున్నాయి. దెబ్బతిన్న చోట రోడ్లకు మరమ్మతులు చేపట్టాల్సిన అధికారులు కూడా చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో రాకపోకలు సాగించే సామాన్యులు ప్రాణాలు కోల్పోతున్నారు.



మహలింగి రోడ్డుపై భారీ గుంత

గుంతల రోడ్డుతో ఇబ్బందులు..

ఎనిమిదేళ్ల కిందట ముధోల్ నుంచి తానూరు మీదుగా బెల్‌తరోడా జాతీయ రహదారి 61 వరకు ఆర్ అండ్‌బీ నిధులు రూ.36 కోట్లతో 18 కిలోమీటర్ల మేర డబుల్ రోడ్డు నిర్మాణం చేపట్టారు. కొన్నేళ్ల కిందట తానూరు, కోలూరు మీదుగా మొగ్లి గ్రామం వరకు తొమ్మిది కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణం చేపట్టారు. ముధోల్ మీదుగా ఖర్బాలా నుంచి జౌలా(బి) ఎక్స్‌రోడ్డు వరకు.. ముధోల్ నుంచి ఎల్వత్ వరకు, ఝరి(బి) నుంచి ఝరి(బి)తండా, బెల్‌తరోడా నుంచి బామ్నితండా గ్రామం వరకు బీటీ రోడ్లు నిర్మించారు. సంబంధిత కాంట్రాక్టర్ పనుల్లో నాణ్యత పాటించకపోవడంతో రోడ్లపై కంకరతేలి గుంతలు ఏర్పడ్డాయి. దీంతో వాహనదారులు తరచుగా రోడ్డు ప్రమాదాల బారిన పడుతున్నారు.

మరమ్మతులు చేపట్టాలి..

ఈ గ్రామాలకు ఉన్న బీటీ రోడ్లపై గుంతలు ఏర్పడి.. కంకర తేలి ప్రమాదకరంగా మారాయి. దీంతో రాకపోకలు సాగించేటప్పుడు వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. రోడ్లకు మరమ్మతులు చేయించాలని అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎప్పుడే ఏ యే ప్రమాదం జరుగుతుందోనని ప్రాణాలు అరచేతి లో పెట్టుకొని వస్తున్నామని.. రోడ్లపై ఏర్పడిన గుంతలను పూడ్చివేయాలని వేడుకుంటున్నారు.

జరిగిన రోడ్డు ప్రమాదాలివీ..

- ఇటీవల డబుల్ రోడ్డు(రెండు వరుసల రహదారి)పై హిప్నెల్లి శివారులో గుంతను తప్పించే క్రమంలో ఎదురెదురుగా రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్నాయి. ఈ ఘటనలో భోసి గ్రామానికి చెందిన కైలాస్ మృతి చెందగా.. బెంబర గ్రామానికి చెందిన శివపూరే మాణిక్‌దాస్ తీవ్రంగా గాయపడ్డాడు.
- నాలుగు నెలల కిందట బామ్ని ఎక్స్ రోడ్డు సమీపంలో గుంతలను తప్పించే క్రమంలో ముగ్గురితో వెళ్తున్న బైక్ అదుపుతప్పి కిందపడింది. ఈ ఘటనలో కర్కెల్లి గ్రామానికి చెందిన బత్తుల్‌వార్ చంద్రకళ అక్కడికక్కడే మృతి చెందింది.
- ఆరు నెలల కిందట భోసి శివారులో రాత్రి గుంతలు ఏర్పడక బైక్‌పై నుంచి పడి బామ్నితండా యువకుడు మృతి చెందాడు.
- బామ్నితండా సమీపంలో సావ్లి గ్రామానికి చెందిన ఇద్దరు ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడ్డారు.



హిప్నెల్లి శివారులో రెండు వరుసల రోడ్డుపై ప్రమాదంలో మృతి చెందిన కైలాస్ (ఫైల్)

గుంతలు తప్పించబోయి..



తానూరు నుంచి బెల్‌తరోడా గ్రామానికి ఉన్న డబుల్ రోడ్డుపై గుంతలు ఏర్పడ్డాయి. గుంతలను తప్పించే క్రమంలో వాహనదారులు కింద పడి మృతి చెందుతున్నారు. అధికారులు గుంతలకు మరమ్మతులు చేయించి రోడ్డుకు ఇరువైపుల ఉన్న ముళ్లపొదలను తొలగించాలి.

– లక్ష్మణ్‌పటేల్, హిప్నెల్లి

ప్రతిపాదనలు పంపించాం

తానూరు–మొగ్లి, ఝరి(బి), మహలింగి, బామ్ని, ఎల్వత్ గ్రామాల రోడ్లకు మరమ్మతులు చేయించాలని ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరైతే బీటీ రోడ్లపై ఏర్పడిన గుంతలకు మరమ్మతులు చేసి సమస్యలు పరిష్కరిస్తాం. తానూరు నుంచి బెల్‌తరోడా వరకు ఉన్న డబుల్ రోడ్డు ఆర్అండ్‌బీ పరిధిలోనిది.

– చందు, పీఆర్ డీఈ

నేడు ఉచిత శిక్షణ కేంద్రం ప్రారంభం

భైంసాటౌన్: పట్టణంలోని శివాజీచౌక్ ప్రాంతంలో సోమవారం ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ చేతుల మీదుగా ఎస్ఎస్ స్టడీ సర్కిల్ ప్రారంభించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. అనసూయ పవార్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే ఈ స్టడీ సర్కిల్‌లో వివిధ పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులకు ఉచిత శిక్షణ అందించనున్నట్లు పేర్కొన్నారు. నియోజకవర్గ పరిధిలోని యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దూర ప్రాంత విద్యార్థులకు వసతి సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు.

మున్నూరుకాపు సంఘ కార్యవర్గం



నూతన కార్యవర్గం

భైంసాటౌన్: పట్టణంలోని పిప్రి కాలనీ మున్నూరుకాపు సంఘ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. ఈమేరకు సంఘ భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో అధ్యక్షుడిగా లంక గంగాధర్, ఉపాధ్యక్షుడిగా పసుల లక్ష్మణ్, కార్యదర్శిగా బోయిడి రవి, సహ కార్యదర్శిగా ఇందూర్ సంజీవ్, కోశాధికారిగా లక్ష్మణ్, ఇతర సభ్యులను ఎన్నుకున్నారు. కార్యవర్గాన్ని సభ్యులు సత్కరించారు.

స్పందించి.. స్లాబ్ వేయించి



పనులు చేయిస్తున్న జీవీ రమణారావు

కుంటాల: మండల కేంద్రంలోని పదో వార్డులో మురికి కాలువపై ఉన్న స్లాబ్ దెబ్బతిని రెండేళ్ల కిందట పెద్ద గుంత ఏర్పడింది. దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించే ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. స్లాబ్ నిర్మించేందుకు మాజీ ఎంపీపీ జీవీ అరుణరమణారావు ముందుకొచ్చి సొంతంగా రూ.50వేలు వెచ్చించి ఆదివారం మురికి కాలువపై స్లాబ్ వేయించారు. కాలనీవాసులు వారికి కృతజ్ఞతలు తెలిపారు.

స్థానిక పాఠశాలల్లోనే చదివించాలి

- ముధోల్ ఎమ్మెల్యే రామారావ్ పటేల్

తానూరు: విద్యార్థులను మహారాష్ట్రలోని పాఠశాలలకు పంపకుండా స్థానికంగా ఉన్న సర్కారు బడుల్లోకే చదివించాలని ముధోల్ ఎమ్మెల్యే రామారావ్ పటేల్ అన్నారు. ఆదివారం మండలంలోని ఎల్వత్ గ్రామంలో రూ.19.90లక్షలతో నిర్మించిన పాఠశాల భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. గతంలో ఇక్కడ పాఠశాలకు భవనం లేక విద్యార్థులకు మహాలక్ష్మి ఆలయంలో తరగతులు బోధించారని గుర్తు చేశారు. ప్రస్తుతం విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలున్నాయని.. సద్వినియోగం చేసుకొని ఉన్నతంగా చదవాలని పేర్కొన్నారు.



పాఠశాల భవనం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామారావ్ పటేల్

పాఠశాలలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంఈవో సుభాష్, సర్పంచ్ జ్యోతి, ఎంపీటీసీ సభ్యురాలు పుష్ప భీంరాజ్, నాయకులు సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతగా ఓటు వినియోగించుకోవాలి

నిర్మల్‌టౌన్: 18 ఏళ్లు నిండినవారు బాధ్యతగా తమ ఓటును వినియోగించుకోవాలని మున్సిపల్ కమిషనర్ సీవీఎన్ రాజు అన్నారు. ఆదివారం స్వీప్ కార్యక్రమంలో భాగంగా జిల్లా కేంద్రంలోని ప్రధాన వీధుల గుండా ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు దాని విలువ అనే అంశంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రత్యేక ఓటర్ నమోదు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇందులో మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కుంటాల: మండలకేంద్రంలో ఆదివారం ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని డీటీ నరేశ్‌గౌడ్ పరిశీలించారు. ఈసారి 199 మంది కొత్తగా ఓటరుగా నమోదు చేసుకున్నారని పేర్కొన్నారు. వారి వెంట ఆర్ఐ అడెల్లు, సీనియర్ అసిస్టెంట్ జ్ఞానేశ్వర్ తదితరులు ఉన్నారు.

ఓటరు దరఖాస్తుల స్వీకరణ

ఖానాపూర్: ప్రత్యేక ఓటరు నమోదులో భాగంగా పట్టణంతోపాటు మండలంలోని పలు గ్రామాల్లో ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈసందర్భంగా బీఎల్‌వోలు మాట్లాడారు. ఫిబ్రవరి 8 వరకు జరిగే ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీఎల్వోలు విజయలక్ష్మి, వరలక్ష్మి, పుష్ప తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

సోన్: మండలంలోని పాక్‌పట్ల గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మాజీ సర్పంచ్ తోట లింగన్న, పట్టేపురం నర్సవ్వ, తల్వేద ముత్యం మరణించారు. ఆదివారం బాధిత కుటుంబాలను వారి ఇళ్లకు వెళ్లి నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి పరామర్శించారు. సరికెల గంగన్న, హరీశ్‌రెడ్డి, మార గంగారెడ్డి, ఎల్‌చల్ రమేశ్‌రెడ్డి, జక్క రాజేశ్వర్, జమాల్, ముత్యం రెడ్డి, శ్రీనివాస్, గడ్డం గంగారెడ్డి తదితరులున్నారు. పాక్‌పట్లలో మాజీ సర్పంచ్ తోట లింగన్న, నల్ల నర్సవ్వ, తల్వేద ముత్యం కుటుంబసభ్యులను బీఆర్ఎస్ రాష్ట్ర మాజీ కార్యదర్శి వి.సత్యనారాయణగౌడ్ పరామర్శించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎల్‌చల్ గంగారెడ్డి, బీఆర్ఎస్ మండల కన్వీనర్ మోహినొద్దీన్, ముత్యంరెడ్డి, రమేశ్‌రెడ్డి, నర్సారెడ్డి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.



సోన్: బాధితుల్ని పరామర్శిస్తున్న మహేశ్వర్‌రెడ్డి

లక్ష్మణచాంద: మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకుడు అట్ల చిన్న రాంరెడ్డి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆదివారం డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు బాధితుడి ఇంటికి వెళ్లి పరామర్శించి ఆరోగ్యం గురించి తెలుసుకున్నారు. మండలాధ్యక్షుడు వొడ్నాల రాజేశ్వర్, రాంరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, ఈటెల శ్రీనివాస్, నాగేశ్ తదితరులు పాల్గొన్నారు.

వికసిత్ భారత్ సంకల్ప్‌యాత్ర

తానూరు: కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలు వినియోగించుకోవాలని బీజేపీ ముధోల్ అసెంబ్లీ కన్వీనర్ తాడేవార్ సాయినాథ్ అన్నారు. ఆదివారం మండలంలోని నంద్‌గాం, జౌలా (కే), ఉమ్రి(కే) గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం అందించే ఉజ్వల, ఆయుష్మాన్ భారత్, ముద్రతోపాటు ఇతర రుణాలను వివరించారు. బ్యాంక్ సిబ్బంది పలు పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గణేశ్, సాయినాథ్, నారాయణ్, బ్యాంక్ సిబ్బంది, ఆయా గ్రామాలకు చెందిన కార్యకర్తలు పాల్గొన్నారు.

భైంసా అల్ఫోర్స్‌లో 'శ్రీరాం'



శ్రీరాం తెలుగు అక్షరాల ఆకృతిలో విద్యార్థులు

భైంసాటౌన్: అయోధ్య కార్యక్రమం పురస్కరించుకొని ఆదివారం భైంసా లోని అల్ఫోర్స్ పాఠశాలలో వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు శ్రీరాం అనే తెలుగు అక్షరాల ఆకృతిలో కూర్చొని ప్రదర్శన చేశారు. చైర్మన్ వి.నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ రామ మందిరం హిందువుల చిరకాల స్వప్నమన్నా రు. ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జగదభిరాముడి వేడుకకు ముస్తాబు

- విద్యుత్ కాంతుల్లో ఆలయాలు
- గ్రామాల్లో మార్మోగుతున్న శ్రీరామనామం
- నేడు ప్రత్యేక పూజాది కార్యక్రమాలు



విద్యుత్ దీపాలంకరణలో భైంసాలోని పులేనగర్ హనుమాన్ ఆలయం



సోన్: న్యూవెల్మల్‌లో హనుమాన్ ఆలయం

భైంసాటౌన్: జగదభిరాముడి వేడుకకు జిల్లాలోని ఆలయాలు ముస్తాబయ్యాయి. భైంసాలోని కాలనీల్లోని హనుమాన్ మందిరాలతోపాటు కిసాన్‌గల్లి మహాదేవ్‌మందిర్, తదితర ఆలయాల్లో సోమవారం విశేష పూజాది కార్యక్రమాలు నిర్వహించనున్నారు. నేడు అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ వేడుకను పురస్కరించుకుని వీహెచ్‌పీ, అయోధ్య రామజన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ఆలయాల్లో ఉదయం నుంచే పూజాది కార్యక్రమాలు, భజన, హారతులు, సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించనున్నారు. ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని స్థానికంగా వీక్షించేలా ఎల్‌ఈడీ తెరలు ఏర్పాటు చేశారు. స్థానిక హిమ్మత్‌రావ్ తోటలోని హనుమాన్ మందిరంలో రామాయణ పాత్రలతో నాటిక, పిల్లలకు పోటీలు, భరతనాట్యం, భక్తి గీతాలు, తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు. సహస్ర రామ నామం, రామాయణ గాథ వివరణ కార్యక్రమాలు చేపట్టనున్నారు. అలాగే ఆయా ఆలయాల్లో అన్నదానం, ప్రసాద వితరణ చేయనున్నారు.

సోన్: మండలంలోని ఆలయాలు ముస్తాబై..శ్రీరామనామంతో మారుమోగుతున్నాయి. న్యూవెల్మల్‌లో హనుమాన్ ఆలయాన్ని ముస్తాబు చేశారు. ఆదివారం ఇంటింటికీ శ్రీరామనామం, కాషాయ జెండాలు పంపిణీ చేశారు. సోమవారం ఆలయంలో పూజలు నిర్వహించి అన్నదానం చేస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.



లక్ష్మణచాంద: రాచాపూర్‌లో ఇంటిపై జెండాలు

లక్ష్మణచాంద: మండలంలోని చామన్‌పెల్లిలో రామాలయం విద్యుత్ కాంతుల్లో వెలిగిపోతుంది. సోమవారం రాముడి విగ్రహానికి ప్రాణ ప్రతిష్ఠ నేపథ్యంలో చామన్‌పెల్లి రామాలయంలో ప్రత్యేక పూజాది కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేస్తారు. కార్యక్రమంలో నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి పాల్గొననున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు సాగర్‌రెడ్డి తెలిపారు.

లక్ష్మణచాంద: ప్రాణప్రతిష్ఠ నేపథ్యంలో ప్రతి ఇంటిపై కాషాయ జెండా ఏర్పాటు చేసి మండలంలోని రాచాపూర్ గ్రామం ప్రత్యేకత చాటుకుంది. అలాగే ప్రతి ఇంటి గడప వద్ద జై శ్రీరామ్ అనే నినాదం రాయించారు. గ్రామంలో ఉన్న 340 ఇళ్లపై పలువురు దాతల సాయంతో కాషాయ జెండాలను ఏర్పాటు చేసి, గడపగడపకూ జైశ్రీరామ్ అనే నినాదాలు రాయించారు.

ప్రమిదలు, కాషాయ జెండాలు పంపిణీ



శాంతినగర్‌లో పంపిణీ చేస్తున్న నాయకులు

ఖానాపూర్: రాముడి విగ్రహానికి ప్రాణప్రతిష్ఠ పురస్కరించుకొని పట్టణంలోని శాంతి నగర్‌తోపాటు పలు కాలనీల్లో హిందూ సంఘాలతో పాటు బీజేపీ నాయకులు ప్రమిదలు, కాషాయ జెండా స్టిక్కర్లను పంపిణీ చేశారు. దీపాలు వెలిగించి.. విజయ మహా మంత్రం పారాయణం 108 సార్లు చేయాలని అవగాహన కల్పించారు. మదిరె సత్యనారాయణ, గోపాల్‌రెడ్డి, ఎనగందుల రవి, కరిపె రాజశేఖర్, కటికె రవి, మారుతి ఉన్నారు.

ఇళ్లపై రాముడి జెండా ఎగరాలి

నిర్మల్‌ఖిల్లా: అయోధ్యలో సోమవారం బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా ప్రతీ హిందువు ఇంటిపై శ్రీరాముడి జెండా ఎగురవేసి, పండగ నిర్వహించుకోవాలని శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ జిల్లా సంయోజకుడు మంచిరాల నాగభూషణం, బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్నగారి భూమయ్య పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని స్థానిక నటరాజ్‌నగర్ కాలనీలో శ్రీరామ నామస్మరణ చేస్తూ 'ప్రతీ ఇంటిపై రాముడి జెండా' కార్యక్రమాన్ని నిర్వహించారు. కాలనీలోని మహిళలంతా మంగళహారలతో హాజరై శ్రీరాముడి జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దాదాపు ఐదుశతాబ్దాల స్వప్నాన్ని అనేకమంది రామభక్తుల ప్రాణత్యాగాల అనంతరం నేడు అయోధ్యలో శ్రీరామ జన్మభూమిలో నూతన ఆలయాన్ని నిర్మించుకున్నట్లు తెలిపారు. ప్రాణ ప్రతిష్ఠ నేపథ్యంలో ప్రతిఒక్కరూ శ్రీరాముడికి ప్రత్యేక పూజలు నిర్వహించాలని కోరారు. సోమవారం జిల్లాలోని ప్రతీ హిందువు ఇంట్లో దీపావళి పండుగ లాగా పర్వదినాన్ని నిర్వహించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో లక్కడి లింగారెడ్డి, నర్సయ్య, మోహన్‌రెడ్డి, కాలనీ మహిళలు పాల్గొన్నారు.



జెండా ఆవిష్కరిస్తున్న తీర్థక్షేత్ర ట్రస్ట్ నాయకులు

'నేతకానీలకు గుర్తింపునివ్వాలి'

కడెం: నేతకానీల సమస్యలను పరిష్కరించి..రాష్ట్ర ప్రభుత్వం గుర్తింపునివ్వాలని నేతకాని సంఘ నాయకుడు జడ ఇందూర్‌నేత, సునారికారి రాజేశ్ నాయక్ డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని హరితరిసార్ట్స్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. సర్టిఫికెట్లలో నేతకానీకి బదులు నేత అని ఉండటంతో విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో ఇబ్బందులు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. ఇటీవల కొందరు నాయకులు నేతకానీ సంఘ సమావేశాల పేరిట అధికారులు, నాయకుల వద్ద వసూళ్లకు పాల్పడడం సరికాదన్నారు. స్థానిక నేతకానీ నాయకులను కలవకుండా మండలంలో సమావేశాలు ఏర్పాటు చేయవద్దని అన్నారు. కార్యక్రమంలో కడెం, దస్తురాబాద్ మండలాల నేతకానీ సంఘ నాయకులు జడ రాజేశ్వర్, దుర్గం లింగన్న, రమేశ్, కమలాకర్, శివశంకర్, రాజేశ్, శైలేందర్, తిరుపతి, లింగన్న, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.